అనిల్ రావిపూడి దర్శకత్వంలో?

టాలీవుడ్ అగ్ర హీరో చిరంజీవి ప్రస్తుతం చేయబోతున్న సినిమా 'విశ్వంభర'(వర్కింగ్ టైటిల్). వశిష్ట దర్శకుడు. యూవీ క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆల్రెడీ షూటింగ్ మొదలైంది. చిరంజీవి లేని సన్నివేశాలను దర్శకుడు చిత్రీకరించే పనిలో ఉన్నారు. త్వరలో చిరంజీవి ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు. ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత చేయనున్న సినిమాకు కూడా మెగాస్టార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసినట్టు విశ్వసనీయ సమాచారం. బాలయ్యతో 'భగవంత్ కేసరి'లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి నటించనున్నట్టు తెలిసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది చివర్లో మొదలవుతుందని వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది. వచ్చే ఏడాది ఆగస్ట్‌కి మెగాస్టార్ 70లోకి అడుగుపెడతారు. ఈ వయసులో కుర్ర హీరోలకు ధీటుగా సినిమాలు చేస్తూ రానున్న తరానికి కూడా ప్రేరణగా నిలుస్తున్నారు చిరంజీవి.

అంత టైమ్ నాకు లేదు

శ్రీలీల

తనకు కాబోయే భర్త ఎలా ఉండాలి? అతనికి ఉండాల్సిన క్వాలిటీలు ఏంటి? తదితర అంశాలను సరదాగా ఓ ఇంటర్వ్యూలో తెలియజేసింది అందాల భామ శ్రీలీల. ' నన్ను చేసుకోబోయేవాడికి ముచ్చటగా మూడు లక్షణాలుండాలి. అవి కూడా చాలా సింపుల్ లక్షణాలు. అందులో మొదటిదేంటంటే.. కొన్ని విషయాల్లో నన్ను భరించడం చాలా కష్టం. కానీ ఆ కష్టాన్ని కూడా ఇష్టంగా భావించాలి.. భరించాలి. రెండు.. అతనికి చక్కని హాస్య చతురత ఉండాలి. సెన్సాఫ్‌హ్యూమర్‌తో నవ్వించేవాడైవుండాలి. మూడు.. కాస్త ఫ్యామిలీ టైప్‌గా పద్ధతిగా అందంగా ఉండాలి. అంతే సింపుల్.. ఈ మూడు గుణాలు ఉంటే చాలు.' అంటూ చెప్పుకొచ్చింది శ్రీలీల. అలాంటివాడు ఎవరైనా తారసపడ్డాడా ? అని అడిగితే 'లేదు.. ఒక వేళ కనిపించినా కాన్సన్ ట్రేట్ చేసేంత టైమ్ నాకు లేదు. నేను బిజీ..' అంటూ తనదైన శైలిలో చెప్పింది శ్రీలీల.

ప్రతీకారమే పవర్‌ఫుల్ ఎమోషన్

సినిమాకి 'యానిమల్' అని పేరు పెట్టడానికి గట్స్ కావాలి. ఎందుకు పెట్టారు ఆ పేరు?

మనిషి ఓ సోషల్ యానిమల్. కాస్త జ్ఞానం తోడవ్వడంతో జీవరాశుల్లో మనకు లీడర్ షిప్ వచ్చిందని నా ఉద్దేశం. జంతువులు తమ కుటుంబాన్ని విపరీతంగా ప్రేమిస్తాయి. సొంతమైన వాటికోసం ప్రాణాలను పణంగా పెడతాయి. ఇందులో హీరో కూడా అంతే.. తండ్రి కోసం ఎంతదూరమైనా వెళతాడు. కుటుంబాన్ని విపరీతంగా ప్రేమిస్తాడు. అందుకే ఈ పేరు పెట్టా. 'అరవింద సమేత వీరరాఘవ' అని పేరు పెట్టడం కష్టం. అది త్రివిక్రమ్ మాత్రమే పెట్టగలరు. 'యానిమల్' అనే పేరు ఎవరైనా పెడతారు. నాకు నచ్చింది. అదృష్టం బావుండీ ఎవరూ ఆ టైటిల్‌ని రిజిస్టర్ చేసుకోలేదు. నా సినిమాకు పెట్టుకున్నాను.

ట్రైలర్ చూస్తుంటే ఇది తండ్రీకొడుకుల కథలా అనిపిస్తుంది?

అవును ఇది తండ్రీకొడుకుల కథ. తండ్రిని అమితంగా ప్రేమించే కొడుకు కథ ఇది.

ఈ సినిమా నిర్మాణంలో కూడా భాగమవ్వడానికి కారణం?

క్రియేటివ్‌గా నన్ను క్రిటిసైజ్ చేసే ఏకైక వ్యక్తి మా బ్రదర్ ప్రణయ్‌రెడ్డి వంగా. అలాంటి వ్యక్తి ప్రొడక్షన్‌లో ఉంటే క్రియేటివ్‌గా కూడా మంచిది కదా. ఇక భూషణ్‌గారితో 'కబీర్‌సింగ్' చేశాం. తెలిసిన నిర్మాత కాబట్టి అలా కంటిన్యూ అవుతున్నది.

అనిల్‌కపూర్ కేరక్టరైజేషన్ ఎలావుంటుంది?

అతని వల్లే, అతని కోసమే నడిచే కథ ఇది. ఈ పాత్రను అనిల్‌కపూర్ మాత్రమే ఆ స్థాయిలో చేయగలరు.

రష్మిక పాత్ర ఎలా ఉంటుంది?

రణ్‌బీర్ తర్వాత ఈ కథలో ముఖ్య పాత్రలు అంటే అనిల్‌కపూర్, రష్మిక పాత్రలే. భర్త వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న భార్యగా ఇందులో రష్మిక కనిపిస్తుంది. చాలా గొప్పగా నటించింది కూడా. హీరో హీరోయిన్ల ప్రేమకథ నుంచే ఈ సినిమా అసలు కథ మొదలయ్యేది. తన పాత్రను రష్మిక ఎంత ప్రేమించిందంటే.. హిందీ, తెలుగు, కన్నడ భాషల్లో సొంతంగా డబ్బింగ్ చెప్పుకుంది.

'అర్జున్‌రెడ్డి' మాదిరిగానే ఇందులో కూడా హీరోకి కోపం ఎక్కువ అనుకుంటా?

ఇద్దరూ చాలా సిన్సియర్ ఫెలోస్. అదొక్కటే వీళ్లిద్దరికీ కామన్ ఫ్యాక్టర్. అర్జున్‌రెడ్డికి కోపం వస్తే కంట్రోల్ చేసుకోలేడు. కానీ ఈ పాత్రకు మనందరికీ ఉన్నట్టే సిట్యువేషన్‌ని బట్టి కోపం తీవ్రత ఉంటుంది. 'అర్జున్‌రెడ్డి' లాగే ఇదికూడా క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్. మిగిలిందంతా కంప్లీట్ డిఫరెంట్. తండ్రి కోసం ఏమైనా చేసే కొడుకు పాత్ర రాసుకున్నప్పుడు పాత్రలో ఆ మాత్రం ఉద్వేగాలు ఉండటం కామన్ కదా.

మీ హీరోలు పెక్యులర్‌గా ఉంటారు. మీ మెంటాలిటీకి దగ్గరగా ఉండేలా పాత్రల్ని క్రియేట్ చేస్తారా?

(నవ్వుతూ) నాకూ నా పాత్రలకు అస్సలు సంబంధం లేదండీ. నచ్చినట్టు రాసుకుంటాను తప్ప వాటిపై నాదే కాదు, ఎవరి ప్రభావం ఉండదు.

ట్రైలర్‌లో చూస్తుంటే ఎమోషన్‌ని వయోలెన్స్ డామినేట్ చేసిందేమో అనిపిస్తుంది?..

అలాంటిదేం లేదండీ.. అన్నీ కరెక్ట్‌గా బ్యాలన్స్ చేశామనే అనుకుంటున్నాం. మీరే చూసి చెప్పాలి.

మందుతాగి టూవీలరే నడపకూడదు. అలాంటిది మీ మీ కెరీర్‌లో తొలిసారి పెద్ద స్టార్‌తో పని చేశారు. ఎలా ఉంది ఎక్స్‌పీరియన్స్?

రణ్‌బీర్ చాలా గొప్ప వ్యక్తిత్వం గల మనిషి. అసలు లొకేషన్‌లో స్టార్‌లా బిహేవ్ చేయరు. విజయ్ దేవరకొండతో పనిచేసినప్పుడు ఎలా ఉందో, ఇప్పుడూ అలాగే ఉంది. స్టార్‌తో చేసిన ఫీలే లేదు. అసలు ఈ కథను నేను రణ్‌బీర్‌తో చేద్దామనుకోలేదు. ఫలానా వారితో చేయాలనే క్లారిటీ కూడా లేదు. అనుకోకుండా తను విన్నాడు. నచ్చిందన్నాడు.. అలా కుదిరిపోయింది.

హీరో ఏకంగా విమానం నడిపేస్తున్నాడు. అలా చూపించడం సబబేనా?

(నవ్వుతూ) కత్తులతో గొడ్డళ్లతో వందలమందిని తెరపై నరికేస్తే సబబేనా? సినిమాటిక్ లిబర్టీ అనేది ఒకటుంటుంది. సినిమా అంటేనే జనానికి నచ్చే తప్పులు చెయ్యడం. చూడ్డానికి బావుందికదా.. అందుకే పెట్టాను.

బాబీ డియోల్ పాత్ర ఎలా వుంటుంది?

తనది విలన్ పాత్ర. ఆ పాత్ర గురించి ఇప్పుడే రివీల్ చెయ్యలేను..

సెన్సార్ నుంచి ఏ సర్టిఫికెట్ రావడం.. మూడు గంటల 20 నిమిషాల రన్‌టైమ్ ఉండటం సినిమాకు చిన్న పాటి మైనస్ అని అనుకోచ్చా?

ఏ సర్టిఫికెట్ అంటే పిల్లలు రారు.. కాస్త మైనస్సే. అయితే పిల్లల కోసం కాంప్రమైజ్ అయితే మనం అనుకున్న సీన్స్‌లో ఇంటెన్స్ తగ్గిపోతుంది. కాబట్టి తప్పదు. ఇక రన్ టైమ్ అంటారా.. 'అర్జున్ రెడ్డి' మూడుగంటల 6 నిమిషాలు.. చూశారు కదా. ఇది 'అర్జున్‌రెడ్డి' కంటే ఓ పదిహేను నిమిషాలు ఎక్కువ అంతే. సినిమా బావుంటే రన్ టైమ్ ప్రాబ్లం కాదు.

ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే ప్రతీకార నేపథ్యంలా అనిపిస్తున్నది. ఈ నేపథ్యాన్ని ఎంచుకోటానికి కారణమేంటి?

ప్రేమ కంటే ప్రతీకారమే పవర్‌ఫుల్ ఎమోషన్. దాన్ని ఆవిష్కరించడమే కష్టం కూడా. అర్జున్‌రెడ్డికి కోపం వస్తే కొట్టేస్తాడు. వీడు అలాకాదు.. వాడికంటూ ఓ లక్ష్యం ఉంటుంది. ఇందులో ఓ డైలాగ్ కూడా రాశాను.. 'నాన్నా ఇది ఇప్పుడే మొదలైంది.. వాడ్ని కలవాలి.. వాడ్ని చంపాలి.. చాలా పనుంది.. మీరు నిరాశపడకండి నాన్నా' అని. ముందు వాడెవడో తెలియాలి కదా. దానికోసం వాడు చేసే ప్రయత్నంలో ఉంటుంది అసలైన ఎమోషన్. అది రేపు తెరపై చూస్తారు.

మీ నెక్ట్స్ సినిమా 'స్పిరిట్'లో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నాడని టాక్. నిజమేనా?

అవును. అది కాప్ స్టోరీ. సెప్టెంబర్ నుంచి షూటింగ్ మొదలవుతుంది.

> తొలి సినిమాతోనే కల్ట్ మూవీ డైరెక్టర్ అనిపించుకోవడం చిన్న విషయం కాదు. అది తెలుగుచలనచిత్ర చరిత్రలో ఇద్దరి వల్లే అయ్యింది. వారిలో తొలి దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అయితే.. రెండో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. రెండో సినిమా 'కబీర్‌సింగ్'తో తెలుగు సినిమా జెండాను బాలీవుడ్‌లో సైతం రెపరెపలాడించిన దర్శకుడాయన. మూడో ప్రయత్నంగా సందీప్ నుంచి వస్తున్న సినిమా 'యానిమల్'. రణ్‌బీర్ కపూర్, అనిల్‌కపూర్, బాబీడియోల్, రష్మిక మందన్నా ప్రధాన భూమికలు పోషించారు. ఈ పాన్ ఇండియా సినిమా డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి శనివారం విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు.

రామ్‌గోపాల్‌వర్మ 'శివ' తర్వాత మీ 'అర్జున్‌రెడ్డి'ని చాలామంది కల్ట్ మూవీ అన్నారు. నిజంగా 'అర్జున్‌రెడ్డి'కి ఆ స్థాయి ఉందనుకుంటున్నారా?

నేననుకోవడం లేదు. నాకెప్పుడూ అది అతిశయోక్తిగానే అనిపిస్తుంది. నేను కథ చెప్పినప్పుడు కూడా చాలామంది అదేమాట అన్నారు. సినిమా విడుదలయ్యాక మీడియా కూడా అదే మాట అనడం చూసి ఆశ్చర్యపోయాను. నిజానికి 'శివ' వేరే లెవల్. ఆ సినిమా థియేటర్‌లో చూసినప్పుడు కొన్ని సీన్లు చూస్తే భయమేసింది. అప్పుడు చిన్నపిల్లాడ్ని. ఆ తర్వాత డిగ్రీ కొచ్చేదాకా కుదిరినప్పుడల్లా చూస్తూనే ఉండేవాడ్ని. అది టైమ్ లెస్ క్లాసిక్. 'అర్జున్‌రెడ్డి' స్థాయేంటో టైమ్ చెబుతుంది. ఓ ఆరేళ్లనుంచి చెప్పుకుంటున్నారు. ఇంకో పదేళ్ల తర్వాత కూడా అలాగే చెప్పుకుంటారేమో చూద్దాం. అప్పటిదాకా 'శివ'తో పోల్చడం సబబుకాదు.

అన్‌స్టాపబుల్‌కి వెళ్లి బాలయ్యను కలిశారు కదా.. ఎక్స్‌పీరియన్స్?

ఆయన నిజంగా అన్‌స్టాపబుల్. ఆయన 'మొగల్ ఏ అజామ్'లో పృథ్వీరాజ్‌కపూర్ డైలాగులు చెబుతుంటే అలా షాక్‌లో వుండిపోయాం. ఎన్టీయార్‌గారి డైలాగులు చెబితే ఓకే.. పృథ్వీరాజ్‌కపూర్‌గారి డైలాగులు కూడా ఆ రేంజ్‌లో చెప్పడమేంటండీ. రణ్‌బీర్ అయితే, 'సందీప్.. ఇది మా ముత్తాతగారి సినిమా. ఆయన డైలాగులు నాకే గుర్తులేవ్.. ఏంటి ఈయనా?' అంటూ ఉద్వేగానికి లోనయ్యాడు. నిజంగా బాలయ్యగారు గ్రేట్.

విలన్‌గా నటించను

దక్షిణాది ఫిలిం ఇండస్ట్రీలో విజయ్ సేతుపతి ఓ ప్రత్యేకం. భాషలకు అతీతంగా అభిమానుల్ని సంపాదించుకున్న నటుడు విజయ్‌సేతుపతి. రీసెంట్‌గా గోవాలో జరుగుతున్న 'ఇఫీ' వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఇక కొన్నాళ్లపాటు విలన్ పాత్రలు పోషించకూడదని నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. ' నాకు స్టార్ హీరో అనిపించుకోవడం కంటే నటుడు అనిపించుకోవడమే ఇష్టం. అందుకే పాత్ర నచ్చితే చేసేస్తుంటా. కొన్నాళ్ల క్రితం కెరీర్‌లో కాస్త ఛేంజ్ ఉంటుందని విలన్‌గా చేయడానికి ఒప్పుకున్నా. ఆ సినిమా బాగా ఆడింది. దాంతో ఇక వరుసగా విలన్ వేషాలు రావడం మొదలైంది. నేను చేయనన్నా వినేవాళ్లు కాదు. హీరోలు, దర్శకులు ఫోన్లు చేసి మరీ అడిగేవారు. కనీసం స్క్రిప్ట్ వినమంటూ బతిమాలేవాళ్లు. అక్కడే అసలు సమస్య మొదలయ్యేది. వాళ్ల ఎమోషనల్ ప్రెజర్ కారణంగానే చేయడానికి ఒప్పుకునేవాడ్ని. తీరా ఒప్పుకున్న తర్వాత సెట్లో వాళ్లు నన్ను నియంత్రించడానికి ప్రయత్నించేవారు. నాకు చాలా కోపం వచ్చేది. విలన్ పాత్రలు చేయడంలో నాకెలాంటి అభ్యంతరం లేదు. కానీ వాళ్ల ప్రవర్తనే అభ్యంతరకరంగా ఉండేది. దాంతో. అసలు విలన్ పాత్రలు చేయాలా? వద్దా? అనే మీమాంసతో సతమతమయ్యాను. ఇప్పుడు ఓ నిర్ణయానికొచ్చాను. కొన్నాళ్ల పాటు విలన్ పాత్రలు చేయను' అంటూ కరాఖండీ చెప్పేశారు విజయ్‌సేతుపతి.

ఏడు భాషల్లో 'కాంతారా' ప్రీక్వెల్

కన్నడ చిత్రం 'కాంతారా' దేశవ్యాప్తంగా సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. డివోషనల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం భాషా భేదాలకు అతీతంగా ప్రేక్షకుల్ని మెప్పించింది. దాదాపు 400కోట్ల వసూళ్లను సాధించింది. రిషబ్‌శెట్టికి నటుడిగా, దర్శకుడిగా తిరుగులేని గుర్తింపుని తీసుకొచ్చింది. ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతారా చాప్టర్-1'ను తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రీక్వెల్ కొద్ది నెలల క్రితమే ప్రారంభమైనా..ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అప్‌డేట్ రాలేదు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా కాంతారా ప్రీక్వెల్ విశేషాలను వెల్లడించారు రిషబ్‌శెట్టి. ఈ నెల 27న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నామని, ఏడు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. దక్షిణాది నాలుగు భాషలు, హిందీతో పాటు బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. 'కాంతారా' సినిమాకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ప్రీక్వెల్ ఫస్ట్‌లుక్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తొలిభాగం ముందు జరిగిన కథతో 'కాంతారా చాప్టర్-1'ను తెరకెక్కిస్తున్నారు.

వీకే నరేష్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

సీనియర్ నటుడు వీకే నరేష్ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యునైటెడ్ నేషన్స్‌లోని ముఖ్య విభాగం నేషనల్ అకాడమీ ఆఫ్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ ప్లానింగ్ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. శుక్రవారం ఫిలిప్పీన్స్‌లోని మనీలా క్యూజోన్ నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను 'సర్' బిరుదుతో సత్కరించడంతో పాటు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈ సమావేశానికి నేషనల్ ఆకాడమీ ఆఫ్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ ప్లానింగ్ జనరల్ దివాకర్ చంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీకే నరేష్ మాట్లాడుతూ 'ఉగ్రవాదాన్ని అరికట్టడంలో వివిధ దేశాల ప్రభుత్వాలు, ఐక్యరాజ్య సమితి గొప్పగా కృషి చేస్తున్నాయి. మీడియా కూడా ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తున్నది. సినీరంగంలో యాభై ఏండ్లు పూర్తి చేసుకున్న ఈ తరుణంలో అంతర్జాతీయ సంస్థ నుంచి గౌరవ డాక్టరేట్ పొందడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు.

డార్క్ కామెడీ జానర్‌లో..

తిరువీర్

తిరువీర్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్నది. ద్రిష్టి తల్వార్ కథానాయిక. రాజ్ విరాట్ దర్శకుడు. సాయి మహేశ్ చందు, సాయి శశాంక్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో చిత్రీకరణ మొదలుకానున్న ఈ చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. డార్క్ కామెడీ జానర్‌లో ఆద్యంతం నవ్వించే కథా, కథనాలతో స్క్రిప్ట్ తయారైందని, త్వరలో టైటిల్‌ని ఖరారు చేసి, మిగతా వివరాలు తెలియజేస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహించనున్న ఈ చిత్రానికి కెమెరా సుజాత సిద్ధార్థ్.

అన్నంటే దోస్తే సోదరా

సంజోష్, మంచు మనోజ్, సంపూర్ణేష్ బాబు

సంపూర్ణేష్‌బాబు, సంజోష్, ప్రాచీ బంసాల్, ఆరతిగుప్తా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకుడు. ఈ సినిమాలోని 'అన్నంటే దోస్తే సోదరా' అనే పాటను శనివారం హీరో మంచు మనోజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సంపూర్ణేష్ బాబు నవ్వు ఎలాంటి కల్మషం లేకుండా స్వచ్ఛంగా ఉంటుందని, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంపూర్ణేష్‌బాబు మాట్లాడుతూ ''కరెంట్ తీగ' సినిమా చేస్తున్నప్పటి నుంచి మంచు మనోజ్‌తో అనుబంధం కొనసాగుతున్నది. ఆయన్ని నా సొంత అన్నలా భావిస్తా' అని చెప్పారు. సుద్దాల అశోక్‌తేజ రాసిన ఈ గీతం అన్నాదమ్ముల అనుబంధానికి అద్దం పడుతుందని దర్శకుడు మన్‌మోహన్ మేనంపల్లి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జాన్, సంగీతం: సునీల్‌కశ్యప్, నిర్మాత: చంద్ర చగంలా, కథ-దర్శకత్వం: మన్‌మోహన్ మేనంపల్లి.

క్రైమ్ థ్రిల్లర్ 'అథర్వ'

కార్తీక్‌రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'అథర్వ'. మహేష్ రెడ్డి దర్శకత్వం వహించారు. పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నూతలపాటి నరసింహం నిర్మిస్తున్నారు. డిసెంబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని 'కేసీపీడీ' వీడియో సాంగ్‌ను శనివారం విడుదల చేశారు. కిట్టూ విస్సాప్రగడ సాహిత్యాన్నందించిన ఈ పాటకు శ్రీచరణ్ పాకాల స్వరాలను సమకూర్చారు. గ్రామీణ వాతావరణంలో సహజంగా తెరకెక్కించిన ఆ పాట సినిమాలో ప్రధానాకర్షణగా నిలుస్తుందని, క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ఆద్యంతం ఉత్కంఠను పంచే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఇటీవల ఫోరెన్సిక్, క్లూస్ డిపార్ట్‌మెంట్ వారు తమ సినిమాను వీక్షించి ప్రశంసించారని నిర్మాత పేర్కొన్నారు.

కార్తీక్ రాజు

అన్నీ మంచి రోజులే..!

'నాని గ్యాంగ్‌లీడర్' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసింది తమిళ సోయగం ప్రియాంక అరుళ్ మోహన్. ఆ తర్వాత శర్వానంద్‌తో 'శ్రీకారం' చిత్రంలో జోడీ కట్టింది. అయితే ఈ రెండు చిత్రాలు ఆశించిన విజయాలు సాధించకపోవడంతో తమిళ ఇండస్ట్రీపై దృష్టి పెట్టింది. అక్కడ డాక్టర్, డాన్ వంటి చిత్రాలతో మంచి విజయాలను అందుకుంది. అదే ఉత్సాహంతో ప్రస్తుతం తెలుగులో భారీ అవకాశాలను దక్కించుకుంటున్నది. పవన్‌కల్యాణ్ 'ఓజీ', నాని 'సరిపోదా శనివారం'లో ప్రియాంకానే కథానాయిక. ఈ రెండు సినిమాలు నిర్మాణ దశలో ఉండగానే తెలుగులో ఈ భామకు భారీ చిత్రాల ఆఫర్లొస్తున్నాయట. అగ్ర నిర్మాణ సంస్థలు ఈ సొగసరినే నాయికగా తీసుకోవాలనుకుంటున్నాయట. కెరీర్ ఆరంభంలో తెలుగు ఇండస్ట్రీ కాస్త నిరుత్సాహపరచినా..ఇప్పటి పరిస్థితి చూస్తుంటే రాబోవు రోజులన్నీ తనవే అనే ఆనందంలో ఉందట ప్రియాంక అరుళ్ మోహన్. ఇక నుంచి తెలుగుతో పాటు తమిళ ఇండస్ట్రీకి సమప్రాధాన్యతనిస్తూ కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటానని చెబుతున్నది ప్రియాంక అరుళ్ మోహన్.